సాక్షి
నాగర్‌కర్నూల్
ఆదివారం । 25 । ఫిబ్రవరి । 2024



సల్లంగ చూడమ్మా..
నడిగడ్డవానుల కొంగుబంగారం జములమ్మ పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి.
వివరాలు 8లో ▸



..ఉజ్వల భవిష్యత్
రసాయనశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీన్ జైపాల్‌రెడ్డి అన్నారు.
వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.5 /19.5

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ వేడిమి.. ఉదయం, రాత్రివేళల్లో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

హాల్‌టికెట్లు ఇవ్వకుంటే చర్యలు

కందనూలు: జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ శనివారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో కొన్ని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్స్ ఇవ్వడంలో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంటర్ విద్యార్థులు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని నేరుగా tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావొచ్చని తెలిపారు. హాల్‌టికెట్‌పై ప్రిన్సిపాల్ సంతకం కూడా అవసరం లేదన్నారు. దీనిపై అన్ని పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లకు ఇప్పటికే ఆదేశాలు జారీచేసినట్లు పేర్కొన్నారు.

గర్భిణుల నమోదు పక్కాగా ఉండాలి



బిజినేపల్లి: ఆస్పత్రుల్లో జరిగే కాన్పులు, గర్భిణుల నమోదు పక్కాగా ఉండాలని డీఎంహెచ్‌ఓ సుధాకర్‌లాల్ అన్నారు. పాలెం పీహెచ్‌సీలో శనివారం వైద్యాధికారులు, సిబ్బంది, ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులకు హెచ్ఎంఐఎల్ హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి ఆస్పత్రిలో కాన్పుల వివరాలను నమోదు చేయడంతో పాటు చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమం పక్కాగా చేపట్టాలన్నారు. అదేవిధంగా ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కల మందు వేయాలన్నారు. మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటదాస్, డా.కృష్ణమోహన్, డా.తారాసింగ్, డా.లక్ష్మణ్, డా.ప్రదీప్, డా.భీమానాయక్, నరసింహ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 1న కృష్ణా బ్రిడ్జి ప్రారంభం

కృష్ణా: కృష్ణానదిపై నిర్మించిన బ్రిడ్జి మరమ్మతు పూర్తి కావొస్తుండటంతో మార్చి 1 నుంచి ప్రారంభించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. నిజాం కాలంలో నిర్మించిన ఈ బ్రిడ్జి పగుళ్లు రావడంతో జనవరి 17 నుంచి బ్రిడ్జిపై రాకపోకలు నిలిపివేసి మరమ్మతు చేపట్టారు. కాగా ప్రస్తుతం మరమ్మతు పనులు పూర్తికావడంతోపాటు క్యూరింగ్ కూడా పూర్తి స్థాయిలో చేపట్టారు. గతంలో పలుమార్లు ఈ బ్రిడ్జిపై సీసీ నిర్మాణం చేసిన సమయంలో క్యూరింగ్ సరిగా చేయకపోవడం వల్లే రోడ్డు దెబ్బతిందని, ఇప్పుడు ఆ పరిస్థితి రానివ్వకుండగా నాణ్యతగా చేపట్టారు. 40 రోజులుగా ఈ బ్రిడ్జిపై ప్రయాణాలు నిలిపివేయడంతో ప్రయాణికులతోపాటు రైతులు, ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎట్టకేలకు బ్రిడ్జి మరమ్మతు పూర్తికావడం ఆనందంగా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే కేసులు



ఉప్పునుంతల: దుందుభి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేస్తామని అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. శనివారం మొల్గర, జప్తీ సదగోడు సమీపంలోని దుందుభి వాగును ఎస్ఐ లెనిన్‌తో కలిసి డీఎస్పీ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కేవలం ప్రభుత్వ పనుల కోసం అనుమతులు పొంది, రెవెన్యూ వారు నిర్దేశించిన సమయంలోనే దుందుభి వాగు నుంచి ఇసుకను సేకరించాలని సూచించారు. అనుమతులు లేకుండా రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తే, వాహనాలను సీజ్ చేయడంతో పాటు చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి పోలీస్ నిఘా పెంచినట్లు చెప్పారు. అంతకుముందు ఉప్పునుంతల పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు.

కల సాకారం

ఇతర శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఏలకు ఐడీలు క్రియేట్

- అరునెలల నిరీక్షణకు తెర
- బ్యాంక్ ఖాతాల్లో ఒకనెల వేతనం జమ
- త్వరలోనే పెండింగ్ వేతనాలు..
- ఉమ్మడి జిల్లాలో 3,056 మంది వీఆర్‌ఏలు



ఉమ్మడి జిల్లాలో వీఆర్‌ఏల వివరాలు..

నాగర్‌కర్నూల్	వనపర్తి	మహబూబ్‌నగర్	నారాయణపేట	జోగులాంబ గద్వాల
682	664	656	580	474

కల్వకుర్తి: రెవెన్యూ విభాగం నుంచి ఇతర శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఏల కల సాకారమైంది. ఆరు నెలలుగా వేతనాలు లేక పడిన కష్టాలకు తెరపడింది. గ్రామీణ స్థాయిలో కీలకంగా వ్యవహరించిన వీఆర్‌ఏలను గత ప్రభుత్వం ఇతర శాఖలలో సర్దుబాటు చేసింది. అయితే వారికి కేటాయించిన శాఖలలో ఎలాంటి గుర్తింపు లేకపోవడంతో దుర్భర పరిస్థితులను ఎదుర్కొన్నారు. ఇటు జీతాలు రాక.. అటు ఎంప్లాయి ఐడీ లేక సతమతమయ్యారు. ఇలా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వీఆర్‌ఏలకు కొత్త ప్రభుత్వం అధికారంలోకి రాగానే శుభవార్త చెప్పింది. ఆయా శాఖలలో సర్దుబాటు చేసిన వీఆర్‌ఏలకు ఎంప్లాయి ఐడీలు కేటాయించాలని అధికారులకు ఆదేశాలు జారీచేసింది. అందుకు అనుగుణంగా వారికి ఎంప్లాయి ఐడీ కేటాయించడంతో పాటు, ప్రాన్ నంబర్ కోసం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రాన్ నంబర్లు జనరేట్ అయ్యాయి.

ఎదురుచూపులకు తెర..

ఇతర శాఖల్లో సర్దుబాటు అయిన వీఆర్‌ఏలు ఆరు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూశారు. వీరిలో చాలా మంది ఉద్యోగులు ఇతర శాఖలలో పనిచేసేందుకు అనేక కష్టాలు పడ్డారు. గతంలో వీఆర్‌ఏలు తమకు కేటాయించిన గ్రామాలలోనే ఉంటూ, అక్కడి పరిస్థితులను ఉన్నతాధికారులకు చేరవేసేవారు. అలాంటి వారికి ఇతర ప్రాంతాల్లో పోస్టింగ్ ఇవ్వడం.. అక్కడ జీతాలు రాకపోవడంతో చాలా మంది రెవెన్యూ విభాగంలోనే విధులు నిర్వర్తించారు. వీరితో పాటు ఇతర శాఖల్లో పనిచేసిన ఉద్యోగులకు వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నాలుగైదు శాఖల్లో సర్దుబాటు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 3,056 మంది వీఆర్‌ఏలు ఉండగా, నాలుగైదు శాఖలలో మాత్రమే సర్దుబాటు చేశారు. వారి విద్యార్హత మేరకు రెవెన్యూ శాఖలో జూనియర్, రికార్డు అసిస్టెంట్లుగా, ఆఫీస్ సబార్డినేటర్లుగా, మున్సిపాలిటీల్లో జూనియర్ అసిస్టెంట్లతో పాటు వార్డు ఆఫీసర్లుగా, నీటి పారుదల, మిషన్ భగీరథ శాఖలలో హెల్పర్లుగా ప్రభుత్వం నియమించింది. వీరందరికీ ఆయా శాఖలలో ఎంప్లాయి ఐడీలు క్రియేట్ అయ్యాయి. వీరిలో చాలా మందికి జనవరికి సంబంధించిన జీతాలు బ్యాంకు ఖాతాలలో జమ అయ్యాయి. మిగతా 5 నెలలకు సంబంధించిన జీతాలు ఆయా శాఖల ట్రెజరీలలో ఉండగా.. ఈ–కుబేర్ నుంచి నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని ట్రెజరీ శాఖ అధికారులు చెబుతున్నారు.

జీతాలు పడ్డాయి..



కొత్త ప్రభుత్వం ఏర్పడగానే మా సమస్యకు పరిష్కారం లభించింది. ఆయా శాఖల్లో సర్దుబాటు చేసిన వీఆర్‌ఏలకు ఆరు నెలల జీతం పెండింగ్‌లో ఉండగా.. జనవరిలో ఒకనెల వేతనం బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యాయి. మేమంతా ఇప్పుడు ప్రభుత్వ దృష్టిలో ఉద్యోగులుగా నమోదయ్యాం. మిగిలిన 5 నెలల వేతనాలు త్వరలోనే ఆయా శాఖల బడ్జెట్ ద్వారా వస్తాయని అధికారులు తెలిపారు. – రమేష్, ఆఫీస్ సబార్డినేట్, రెవెన్యూ శాఖ

ఐడీలు క్రియేట్ చేశాం..



వీఆర్‌ఏలకు సంబంధించి వచ్చిన అన్ని దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఎంప్లాయి ఐడీలు క్రియేట్ చేశాం. ప్రాన్ నంబర్లు సైతం వారికి కేటాయించి, వారు పనిచేస్తున్న శాఖలకు సమాచారం అందించాం. ఈ–కుబేర్ ద్వారా వారికి ప్రతినెలా జీతాలు పడతాయి. – రమాదేవి, సబ్ ట్రెజరీ అధికారి, కల్వకుర్తి

మన్యంకొండంతా జనం



భక్తులతో కిటకిటలాడుతున్న మన్యంకొండ



స్వామివారికి నైవేద్యం తయారు చేస్తున్న భక్తులు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ క్షేత్రం భక్తజనంతో పులకించింది. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు, పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలొచ్చారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి.. స్వామివారి దర్శనానికి క్యూకట్టారు. కొందరు భక్తులు దాసంగాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి గోవింద నామస్మరణ మార్మోగింది. బ్రహ్మోత్సవాల్లో కీలక ఘట్టమైన రథోత్సవం అర్ధరాత్రి తర్వాత నిర్వహించనున్న సందర్భంగా భక్తులు కుటుంబ సమేతంగా కొండపైకి చేరుకున్నారు. సమీపంలోని గ్రామాల ప్రజలు ఎద్దుల బండ్లపై మన్యంకొండకు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

కల్యాణకట్ట, కోనేరు వద్ద రద్దీ..

మొక్కులు తీర్చుకునే భక్తులు కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించి, కోనేరులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. భక్తులు పెద్దఎత్తున రావడంతో కల్యాణకట్ట, కోనేరు వద్ద తెల్లవారుజాము నుంచే రద్దీ నెలకొంది. స్నానాలు చేసేందుకు షవర్లు, ట్యాప్‌లు ఏర్పాటు చేసినా సరిపోని పరిస్థితి కనిపించింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కొండ దిగువన ప్రధాన రహదారి నుంచి మెట్ల మార్గం వరకు, మరోవైపు ఘాట్ రోడ్డు కమాన్ వరకు ఇరువైపులా భక్తుల రద్దీ ఉండటంతో పోలీసులు భారీ బందోబస్తు కల్పించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి చర్యలు చేపట్టారు.

గుండాల ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర



గుండాల దేవాలయంలో ఆధారాలు సేకరిస్తున్న పురావస్తు పరిశోధకుడు శివనాగిరెడ్డి

వెల్దండ: మండలంలోని గుండాల అంబా రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెయ్యేళ్ల చరిత్ర ఉందని పురావస్తు శాఖ పరిశోధకుడు శివనాగిరెడ్డి అన్నారు. శనివారం ఆలయాన్ని సందర్శించి, అక్కడ లభించిన ఆధారాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయల కాలానికి గుర్తులుగా వీరగల్లు, నాగదేవత శిల్పాలు, పంచలింగాలతో పాటు శాసనాలు ఉన్నట్లు వివరించారు. ఆలయ ఆవరణలో ఉన్న కోనేరు సహజసిద్ధమైనదిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. హైదరాబాద్–శ్రీశైలం రహదారికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆలయానికి భద్రత కల్పించి, పర్యాటకులకు ఆలయ చరిత్ర వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఏళ్ల చరిత్ర ఉన్న ఆలయాన్ని కాపాడుకోవాలన్నారు. కోనేరు చుట్టూ రక్షణ గోడలను నిర్మించాలని తెలిపారు.

ముచ్చటగా మూడోసారి మోదీనే ప్రధాని



కల్వకుర్తిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి

కందనూలు/కల్వకుర్తి రూరల్: ముచ్చటగా మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ఎమ్మెల్సీ ఏవీఎన్.రెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ పనైపోయిందని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత భూస్థాపితం కావడం ఖాయమన్నారు. 75ఏళ్లపాటు పాలించి, రూ.12 లక్షల కోట్ల ప్రజాధనాన్ని లూటీ చేసిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని స్వయంగా ఆ పార్టీ నాయకులే వద్దనుకుంటున్నారని, ఎన్నికల తర్వాత రాహుల్ విదేశాలకు వెళ్లిపోవడం తథ్యమని జోస్యం చెప్పారు.

■ పదేళ్లుగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించాలనే ఉద్దేశంతో విజయ సంకల్పయాత్ర చేపట్టినట్లు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. కల్వకుర్తిలోని పద్మశాలీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి, బీజేపీ మహిళా ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతితో కలిసి విలేకరులతో మాట్లాడారు. కేంద్రం అమలుచేస్తున్న పథకాలను రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు తెలియకుండా చేస్తున్నాయన్నారు. ఆయా పథకాలు తామే అమలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకుంటున్నాయని విమర్శించారు.

■ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 40 సీట్లకే పరిమితమవుతుందని ఆచారి అన్నారు. బీజేపీకి 370కి పైగా సీట్లు వస్తాయని సర్వేలన్నీ స్పష్టం చేస్తున్నాయని చెప్పారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం ప్రపంచ దేశాలకు దిక్సూచిగా మారిందని కొనియాడారు. కాగా, రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు బీజేపీపై చేసిన విమర్శలను తిప్పికొట్టారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే మంత్రి జూపల్లి విమర్శలు అర్థరహితమని అన్నారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు, యాత్ర ఇన్‌చార్జి శ్రీవర్ధన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి, జలాలు శివుడు, సుబ్బారెడ్డి, నరేష్ ఆచారి, దిలీపాచారి, హరిప్రసాద్, రాంచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, నర్సిరెడ్డి, నర్సింహ, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భూదాన్ బోర్డును పునరుద్ధరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: గత ప్రభుత్వం రద్దుచేసిన భూదాన్ బోర్డును పునరుద్ధరించి, భూదాన భూములను కాపాడాలని సర్వోదయ మండలి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.శంకర్‌నాయక్ కోరారు. శనివారం పట్టణంలో జిల్లా సర్వోదయ మండలి మహాసభలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తెలంగాణలో అన్యాక్రాంతమైన భూదాన భూములను కాపాడి, నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని కోరారు. గత ప్రభుత్వం భూదాన్ బోర్డును రద్దుచేసి, గాంధీజీ, వినోబాబావే ఆశయాలను నీరుగార్చిందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం భూదాన్ బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అధ్యక్షుడిగా వై.గిరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా లక్ష్మీపతి, రాముయాదవ్, నాగయ్య, కార్యదర్శిగా వెంకటస్వామి, కార్యదర్శులుగా ఎం.లక్ష్మీనారాయణ, జి.గోపాల్, ఎ.వెంకటేష్, కోశాధికారిగా పి.వెంకటేష్‌తో పాటు మరో 15 మందిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

రేపటి నుంచి ఓపెన్ డిగ్రీ పరీక్షలు

కొల్లాపూర్: ఈనెల 26 నుంచి డా.బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థులకు 5వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ రమేష్‌కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ శనివారం ప్రకటనలో తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్‌తో పాటు, ఐడీ కార్డు తీసుకురావాలని సూచించారు. పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలన్నారు.

కేసుల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి రాజేష్‌బాబు

జిల్లా జడ్జి రాజేష్‌బాబు

నాగర్‌కర్నూల్ క్రైం: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీసులు, న్యాయవాదులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా జడ్జి రాజేష్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కోర్టులో న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ కక్షిదారులు సామరస్యంగా పరిష్కరించుకునే కేసులను జాతీయ లోక్‌అదాలత్ దృష్టికి తీసుకురావాలని పోలీస్ అధికారులకు సూచించారు. రాజీ అయ్యే కేసులను కోర్టు కానిస్టేబుల్స్, ఎస్‌హెచ్‌ఓ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసులు గుర్తించాలని తెలిపారు. జిల్లాలో 13,919 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని.. సివిల్, క్రిమినల్, మనీ రికవరీ కేసులు త్వరగా పరిష్కారమయ్యే విధంగా చూడాలన్నారు. కేసుల పరిష్కారంలో కోర్టు కానిస్టేబుల్స్ క్రియాశీలకంగా ఉండాలని చెప్పారు. డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ సెక్రటరీ సబిత మాట్లాడుతూ.. ఉచితంగా న్యాయ సహాయం అందించేందుకు లీగల్ సెల్ అథారిటీ సిద్ధంగా ఉందని, అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సామరస్య పూర్వకంగా కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, కొల్లాపూర్ కోర్టుల న్యాయమూర్తులతో జిల్లా జడ్జి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, కేసుల వివరాలను తెలుసుకున్నారు. సమావేశంలో న్యాయమూర్తులు కె.మమతారెడ్డి, పి.మౌనిక, శ్రీనిధి, అడిషనల్ ఎస్పీ రామేశ్వర్ ఉన్నారు.

అచ్చంపేట ప్రజలకు క్షమాపణ చెప్పాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట/చారకొండ: మాజీ మంత్రి కేటీఆర్, గువ్వల బాలరాజు స్థానిక ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే అచ్చంపేటకు రావాలని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ అంబేద్కర్ ప్రజా భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2021 ఏప్రిల్ 14న రూ.17కోట్ల పనులకు అప్పటి మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేయగా.. ఒక్క పని కూడా ప్రారంభించలేదని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావు అచ్చంపేట ప్రాంతానికి వచ్చినప్పుడల్లా మాటలు చెప్పి తప్పించుకున్నారన్నారు. అసెంబ్లీకి కేసీఆర్ ఎందుకు రావడం లేదో కేటీఆర్ చెప్పాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కూడా కాకముందే ఏదో అయిపోయిందన్నట్లు విమర్శలు చేయడం తగదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే రెండు అమలు చేశామని.. ఈనెల 27న రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలుచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తాను ఇసుక వ్యాపారం చేస్తున్నట్లు ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రూ.35 కోట్లతో సీసీరోడ్ల పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. భూతర్పూర్–మద్దిమడుగు, అలంపూర్–కొల్లాపూర్–అచ్చంపేట–నల్గొండ జాతీయ రహదారుల ఏర్పాటుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. త్వరలోనే మద్దిమడుగు కృష్ణానదిపై బ్రిడ్జి కల సాకారం అవుతుందన్నారు. దుందుభి వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టి, ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరా చేసే విధానం తీసుకొస్తామన్నారు. మైనింగ్‌శాఖ ద్వారా మన ఊరు–మన ఇసుక పాలసీ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎ.గోపాల్‌రెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్‌గౌడ్, కౌన్సిలర్ గౌరీశంకర్, మాజీ ఎంపీపీ ఎం.రామనాథం, జి.రాజేందర్, కటకం రఘురాం, మాధవరెడ్డి ఉన్నారు.

■ సిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి ఆలయ రోడ్డు విస్తరణ, గుట్టపై వాహనాల పార్కింగ్, భక్తుల వసతులకు సంబంధించి రూ.50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అంతకుముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న శ్రీరామనవమి నాటికి అభివృద్ధి పనులను పూర్తిచేయాలని ఆలయ పాలకవర్గానికి సూచించారు. రూ.వంద కోట్లతో ఆలయాన్ని అపర భద్రాద్రిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీ సింగ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రాంగౌడ్, ఆలయ చైర్మన్ రామశర్మ, డీఈ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ లక్ష్మణ్, జైపాల్, నర్సింహారెడ్డి, నాగేంద్ర, అంజయ్య, గణేష్ పాల్గొన్నారు.

విధేయతకు పట్టం

- చిన్నారెడ్డికి కేబినెట్ హోదా
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియామకం
- శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే మేఘారెడ్డి, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి
- అనుచరుల్లో జోష్.. బాణసంచా కాల్చి సంబరాలు



చిన్నారెడ్డి

వనపర్తి: సుమారు నాలుగు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ జీవితంలో పార్టీకి విధేయుడిగా కొనసాగిన మాజీమంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డిని కాంగ్రెస్ అధిష్టానం గుర్తించి మరోసారి కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టింది. చిన్నారెడ్డిని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేయడంతో.. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి స్తబ్దుగా ఉన్న చిన్నారెడ్డి అనుచరుల్లో ఒక్కసారిగా జోష్ నెలకొంది. ఈ మేరకు జిల్లాకేంద్రంలో ఆయన అనుచర వర్గం బాణసంచా కాల్చుతూ.. పెద్దఎత్తున సంబరాలు చేశారు.

జిల్లాకు రెండోసారి..

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత వనపర్తి జిల్లాకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడి పదవి రెండుసార్లు వచ్చినట్లయింది. 2014 సాధారణ ఎన్నికల్లో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఓడిపోయినా.. కేబినెట్ హోదా కలిగిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్ష పదవి దక్కించుకుని పట్టు సాధించుకున్నారు. పదేళ్ల తర్వాత తన టికెట్‌ను పార్టీ పెద్దల సూచన మేరకు త్యాగం చేసిన చిన్నారెడ్డికి.. కేబినెట్ హోదా కలిగిన పదవి రావడంతో.. పార్టీలో, ప్రజల్లో తన పట్టును సడలనివ్వకుండా జాగ్రత్తపడినట్లయింది.

శుభాకాంక్షల వెల్లువ

సుమారు దశాబ్దంన్నరకాలం తర్వాత చిన్నారెడ్డికి కేబినెట్ హోదా కలిగిన పదవి రావడంతో సామాజిక మాధ్యమాల్లో శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఇక వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డితోపాటు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సైతం వాట్సాప్‌లో చిన్నారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా..

1980లో విద్యార్థి దశ నుంచి రాజకీయంలో చురుకుగా పాల్గొన్న ఈయన మొదట ఉమ్మడి రాష్ట్రంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా.. 1983 నుంచి 85 వరకు యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా, 1989 నుంచి 1993 వరకు ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శిగా పనిచేశారు. ఆ తర్వాత 1989లో ఎమ్మెల్యేగా మొదటిసారి వనపర్తి నియోజకవర్గంలో గెలుపొందారు. 1999, 2004, 2014 ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1997 నుంచి 99 వరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా, 2001 నుంచి 2003 వరకు తెలంగాణ కాంగ్రెస్ ఫోరం కన్వీనర్‌గా, 2007 నుంచి 2009 వరకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్‌లో పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ సంఘం చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

కందనూలు: హైదరాబాద్‌లోని రామంతాపూర్, బేగంపేట్ పబ్లిక్ స్కూళ్లలో ఒకటో తరగతి ప్రవేశం కోసం షెడ్యూల్డ్ కులాల విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రాంలాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రామంతాపూర్, బేగంపేట పాఠశాలల నుంచి జిల్లాకు ఒక్కో సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. గ్రామీణ షెడ్యూల్డ్ కులాల వారి వార్షిక ఆదాయం రూ.లక్ష 50వేలు, పట్టణ ప్రాంతాల వారి వార్షిక ఆదాయం రూ.2 లక్షలకు మించకుండా ఉండాలని తెలిపారు. కుల ధ్రువపత్రం విద్యార్థి పేరుపై ఉండాలని, 2017 జూన్ 1 నుంచి 2018 మే 31 మధ్య జన్మించిన వారు మార్చి 12వ తేదీలోగా మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మార్చి 15న కలెక్టరేట్‌లో లక్కీడ్రిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

సల్లంగ చూడమ్మా.. జములమ్మ తల్లీ

- అమ్మవారిని దర్శించుకున్న 30 వేల మంది భక్తులు
- పౌర్ణమి నేపథ్యంలో సంప్రదాయబద్ధంగా పల్లకీసేవ
- ప్రత్యేక పూజలు చేసిన జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే


ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి (ఇన్‌సెట్‌లో..) ప్రత్యేక అలంకరణలో జములమ్మ


అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు

గద్వాల న్యూటౌన్: డోళ్ల చప్పుళ్లు.. డప్పుల మోతలు.. మంగళ వాయిద్యాలు.. శివసత్తుల పూనకాల మధ్య.. నడిగడ్డవాసుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్న జములమ్మ అమ్మవారి పౌర్ణమి వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. తెల్లవారుజామున ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. సల్లంగ చూడమ్మా.. జములమ్మ తల్లీ అంటూ అమ్మవారిని ప్రార్థించారు. తెల్లవారుజామున 4 గంటలకు 108 కలశాలతో అమ్మవారికి పూజలు, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో 5 గంటలకు అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజామున 3.30 గంటల నుంచే క్యూలైన్‌లో నిల్చున్నారు. ఉమ్మడి జిల్లాతో పాటు ఏపీ, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి సాయంత్రం వరకు దాదాపు 30 వేల మంది భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణ పరిసరాలు కిటకిటలాడాయి. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భక్తుల రద్దీ మరింత పెరిగింది. అమ్మవారికి కోళ్లు, మేకపోతులు బలిచ్చి.. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అమ్మవారికి పల్లకీసేవ నిర్వహించారు. అమ్మ వారి ఉత్సవ మూర్తిని పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణ పరిసరాల్లో ఊరేగించారు.

అమ్మవారి పౌర్ణమి వేడుకల్లో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ సరిత దంపతులు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి దంపతులు తెల్లవారుజామున వేర్వేరుగా ఆలయాన్ని సందర్శించారు. అధికారులు వారికి స్వాగతం పలకగా.. పట్టువస్త్రాలు సమర్పించి.. ప్రత్యేక పూజలు జరిపించారు. బుల్లితెర నటుడు కృష్ణమూర్తి అమ్మవారిని దర్శించుకున్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు..

వేడుకల్లో భాగంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ గాయత్రి సతీష్, ఈఓ పురేందర్‌కుమార్ పర్యవేక్షించారు. పోలీస్, ఆలయ సిబ్బంది క్యూలైన్‌లో తోపులాట జరగకుండా నియంత్రించారు. వైద్యసేవలు అందుబాటులో ఉంచారు. తాగునీటి వసతి కల్పించడంతోపాటు ఎండవేడిమి తగలకుండా ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు.


చలువ పందిళ్ల కింద సేద తీరుతున్న భక్తులు


అమ్మవారి దర్శనానికి క్యూకట్టిన భక్తులు

జోగుళాంబ సన్నిధిలో ప్రముఖులు


హైకోర్టు జడ్జిలకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ ఆలయాలను శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కర్ణాటక హైకోర్టు జడ్జి సుమలత, తెలంగాణ హైకోర్టు జడ్జి ఎజీ ప్రియదర్శిని, జిల్లా జడ్జిలు నిర్మల, గీతాంబ, స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కవిత ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు, అర్చకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థ, ప్రసాదాలు అందజేశారు. కేంద్ర విద్యాశాఖ బృందం చైర్మన్ మాయ, శశికాంత్ సైతం ఆలయాలను దర్శించుకున్నారు. తాండ్రపాడులోని మైనార్టీ పాఠశాలకు ఎన్‌బీఏ అక్రిడేషన్ కోసం పరిశీలించేందుకు వచ్చిన వారు అలంపూర్ వచ్చారని ధర్మవరం పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ తెలిపారు. మైనింగ్ డిపార్ట్ మెంట్ డిప్యూటీ డైరెక్టర్ విజయవాణి, సూపరింటెండెంట్ మాధవి, ఏడీ విజయరామరాజు తదితరులకు సైతం ఆలయ అధికారులు స్వాగతం పలికి పూజలు చేయించారు. కాగా పౌర్ణమి కలసి రావడంతో జోగుళాంబ ఆలయంలో భక్తులు చండీ హోమాలు చేశారు.

శ్రీశైలం మల్లన్నకు పట్టువస్త్రాలు


పట్టువస్త్రాల తయారీ పనులకు పూజలు చేస్తున్న పద్మశాలీలు

అమరచింత: మహా శివరాత్రిని పురస్కరించుకుని శ్రీశైలం బ్రహ్మోత్సవాల్లో మల్లికార్జున స్వామి, భ్రమరాంబిక దేవీలకు పట్టువస్త్రాలను సమర్పించేందుకు అమరచింత పద్మశాలి కులస్తులు శ్రీకారం చుట్టారు. స్వామివారికి భక్తిశ్రద్ధలతో పట్టువస్త్రాలను తయారు చేయడానికి శనివారం మగ్గానికి ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు. పట్టణంలోని శివచౌడేశ్వరి ఆలయంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించిన పూజలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు దేవరకొండ లచ్చన్న పాల్గొన్నారు. శ్రీశైలంలోని పద్మశాలి భవన్‌లో చేనేత మగ్గం ఏర్పాటు చేసి అక్కడే పూర్తి స్థాయిలో పట్టు వస్త్రాలను తయారు చేసి స్వామి సన్నిధికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో మహంకాళి విష్ణు, క్యామ శ్రీను, తాటికొండ రమేష్, పారుపల్లి చింతన్న, మహంకాళి సత్తి, లడ్డు శ్రీనువాసులు, పారుపల్లి శ్రీను, మహంకాళి బాలస్వామి, గాజులు వెంకటేష్ పాల్గొన్నారు.

రసాయనశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్

- ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో జాతీయ సదస్సులో పీయూ ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ జైపాల్‌రెడ్డి


జైపాల్‌రెడ్డిని జ్ఞాపికతో సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నేటి ప్రపంచంలో రసాయనశాస్త్రంతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పీయూ ఫ్యాకల్టీ ఆఫ్ డీన్ జైపాల్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో 'రసాయనశాస్త్రం మరియు సాంకేతికాభివృద్ధి చెందుతున్న పోకడలు' అనే అంశంపై జాతీయ సదస్సు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీలను వదిలి కంప్యూటర్ సైన్స్ వంటి కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. కానీ భూమి మీద దొరికే సమస్త మూలకాల నుంచి మానవ నిర్మాణం వరకు ప్రతి అంశం కూడా రసాయన శాస్త్రంతో ముడిపడి ఉంటుందన్నారు. మనిషి ఉన్నంత కాలం రసాయన శాస్త్రం అవసరం ఉంటుందని, సైన్స్ విద్యార్థులు గమనించాల్సిన అవసరం ఉందన్నారు. కరోనా కాలంలో ఫార్మా ఇండస్ట్రీస్ హైదరాబాద్ వైరల్ డ్రగ్స్ కరోనా వ్యాధి కోసం ప్రపంచ దేశాలకు సరఫరా చేసిన ఘనత మనకు ఉందని, రసాయన శాస్త్రం గొప్పతనం అటువంటిదన్నారు. పీయూ ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ మాట్లాడుతూ.. రసాయనశాస్త్రంలో హరిత రసాయన శాస్త్రం యొక్క సూత్రాలు ఎంతో కీలకమన్నారు. పరమాణువుల వ్యవస్థతో పలు రకాల మూలకాలం ప్రాధాన్యత తెసుకోవాలని, మనిషి అవసరం కోసం నిరంతరం పరిశోధనలు జరగాలని, ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు మనవుని భవిష్యత్‌ను సులభతరం చేసేలా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రీసోర్సు పర్సన్ మురళీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, అధ్యాపకులు తిరుమలేష్, లావణ్య, ముంతాజ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంపులో పడి చిన్నారి మృతి


అమ్ములు (ఫైల్)

బిజినేపల్లి: వెల్గొండ పరిధి కొత్త తండా వద్ద అమ్ములు (7) అనే చిన్నారి సంపులో మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తిమ్మాజీపేట మండలంలోని పోతిరెడ్డిపల్లి పరిధిలోని తండాకి చెందిన మన్ని, కుమార్తె అమ్ములుతో కలిసి శనివారం ఉదయం ఒక శుభకార్యానికి వెళ్లి అక్కడి నుంచి కొత్తతండా వద్ద ఉన్న పుట్టింటికి వచ్చారు. ఈ క్రమంలో మధ్యాహ్న సమయంలో అమ్ములు ఇంటి ముందర ఆడుకుంటూ వెళ్లి సంపులో పడిపోయింది. ఎంతసేపటికీ కనిపించకపోవడంతో తల్లి మన్ని, కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికారు. అనుమానం వచ్చి సంపులోకి చూ డగ అమ్ములు చనిపోయి కన్పించింది. దీంతో వారంతా కన్నీరుమున్నీరుగా విలపించారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి దుర్మరణం

తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం బట్టుపల్లికి చెందిన చంద్రశేఖర్‌గౌడ్(30) శ్రీశైలం వెళ్లేందుకు శనివారం బైక్‌పై బయలుదేరాడు. తెలకపల్లి మండల పరిధిలోని రాకొండ గ్రామ గుట్ట సమీపంలో పోలెపల్లి నుంచి ఎదురుగా వస్తున్న ఆటో, ఉదయం 6.30 గంటలకు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న చంద్రశేఖర్‌గౌడ్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య లావణ్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామేశ్వర్‌రెడ్డి తెలియజేశారు.

కొత్తకోట రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ ఘటన కొత్తకోట సమీపంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి వివరాల మేరకు.. కొత్తకోటలో శుక్రవారం రాత్రి ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే రాజాసింగ్ హాజరు కాగా.. హిందూవాహిని సభ్యులు వలంటీర్లుగా పనిచేశారు. అందులో పట్టణానికి చెందిన కె.పవన్‌కుమార్ (24) ఉన్నాడు. ఉదయం నుంచి ఛత్రపతి శివాజీ ఉత్సవ విగ్రహం ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నాడు. రాత్రి విగ్రహావిష్కరణ అనంతరం భోజనం చేసేందుకు సమీపంలోని ఓ రెస్టారెంట్‌కు బైక్‌పై వెళ్తుండగా.. హెచ్‌కేజీఎస్ దాబా సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జడ్చర్ల: మండలంలోని పోలేపల్లి సెజ్ ప్రాంతంలో 44వ జాతీయ రహదారిపై మోటర్ బైక్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో వ్యక్తి అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. అతని దగ్గర లభించిన గుర్తింపు కార్డు ప్రకారం పోలేపల్లి సెజ్‌లో ఎవర్టోజన్ ఫార్మ పరిశ్రమలో పని చేస్తున్న పసుపుల చంద్రశేఖర్(38)గా గుర్తించారు. మృతదేహాన్ని బాదేపల్లి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

మన్యంకొండకు ఆర్టీసీ క్యాంపులు ప్రారంభం


జాతర బస్సుల క్యాంపు ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఆర్‌ఎం తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ జాతరను పురస్కరించుకొని ఆర్టీసీ బస్సుల క్యాంప్‌ను శనివారం జిల్లాకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో రీజినల్ మేనేజర్ శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం మహబూబ్‌నగర్ డిపో నుంచి బస్సులు నడుపుతున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా మన్యంకొండ ఆలయం దిగువన, కొండపైన బస్సుల క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ శ్యామల, డిపో మేనేజర్ సుజాత తదితరులు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: మన్యంకొండ జాతర సందర్భంగా శనివారం దేవస్థానం ఆవరణలో రవి చిన్నపిల్లల ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచారు. చిన్నపాటి గాయాలు, డిహైడ్రేషన్, ఇతర తేలికపాటి ఆరోగ్య సమస్యలు వచ్చిన వారికి మందులు అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం ద్వారా భక్తులకు పలు రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. ఆస్పత్రి నుంచి ప్రత్యేక సిబ్బంది అక్కడ విధులు నిర్వహిస్తూ అవసరమైన వారికి సేవలు అందిస్తారని చెప్పారు.

రేపటి నుంచి ఎస్‌జీఎఫ్ అండర్ 14 క్రికెట్ టోర్నీ



జడ్చర్ల టౌన్: పట్టణంలోని మినీస్టేడియంలో సోమవారం నుంచి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14 బాలుర రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి రమేష్ తెలిపారు. సోమవారం నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించే టోర్నీకి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. టోర్నీకి సంబంధించిన ఏర్పాట్లు పిజికల్ డైరెక్టర్ శారద, పరశురాం, మోయిన్ భానుకిరణ్, కృష్ణ, రాములు, శ్రీనులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ మేరకు మైదానాన్ని చదునుచేసి పిచ్ సిద్ధం చేశామన్నారు.

'రైతుబంధు' పక్కదారి

- ఏఈఓ నిర్వాహకంతో నిధులు మళ్లింపు
- రైతు ఫిర్యాదుతో కదిలిన డొంక
- ఏఈఓపై సస్పెన్షన్ వేటు

గట్టు: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందించే పెట్టుబడి సాయం పక్కదారి పట్టింది. రైతుబంధు నిధులు అర్హులైన రైతులకు అందకుండా బినామీల బ్యాంక్ ఖాతాలకు మళ్లించారు. బాధిత రైతు ఫిర్యాదుతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రైతుబంధు నిధులు కాజేసిన ఏఈఓపై సస్పెన్షన్ వేటుపడింది. వివరాల్లోకి వెళ్తే.. గట్టు మండలం బల్గెర ఏఈఓగా మాచర్ల ఏఈఓ దివ్య కొంతకాలం పనిచేశారు. ఆమెను కొందరు దళారీలు మచ్చిక చేసుకుని, బల్గెరలో వ్యవసాయ పొలం ఉండి.. ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న వారితో పాటు చనిపోయిన రైతుల వివరాలను సేకరించారు. వారి పేరున ప్రభుత్వం ప్రతి ఏటా విడుదల చేస్తున్న రైతుబంధు నిధులు ఇతర వ్యక్తుల బ్యాంక్ ఖాతాల్లో జమచేసే విధంగా పథకం పన్నారు. 2019–20, 2020–21, 2021–22 సంవత్సరాల్లో రైతుబంధు నిధులను అసలు రైతుల ఖాతాల్లో కాకుండా బినామీల ఖాతాల్లో జమచేశారు. ఇలా జమ అయిన నిధులను ఏఈఓతో పాటు దళారీలు పంచుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 64 మంది రైతులకు సంబంధించిన రైతుబంధు నిధులు సుమారు రూ.36 లక్షలను దారి మళ్లించినట్లు తెలిసింది. అసలు విషయం తెలుసుకున్న బాధిత రైతుల్లో ఒకరు వ్యవసాయశాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. జిల్లా వ్యవసాయాధికారులు ప్రాథమిక విచారణ చేసి, కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఈమేరకు బల్గెర ఏఈఓగా పనిచేసిన దివ్యను సస్పెన్షన్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ వ్యవహారంపై విచారణ కమిటీ త్వరలోనే క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవాలను వెలుగులోకి తీసుకొచ్చేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

దుండగుల హల్‌చల్

- పొలం దగ్గర మహిళపై దాడికి యత్నం
- పరుగెత్తి తప్పించుకున్న మహిళ
- పోలీసులు వెతికినా దొరకని దుండగులు

దామరగిద్ద: పట్టపగలు పొలం దగ్గర గేదెలు మేపుతున్న మహిళపై గుర్తుతెలియని దుండగులు దాడికి యత్నించగా, ప్రాణభయంతో పరుగెత్తి తప్పించుకున్న సంఘటన శనివారం మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు, బాధితురాలు వివరాల ప్రకారం.. దామరగిద్ద తండాకు చెందిన విజ్జమ్మ రోజు మాదిరిగా తన పొలంలో గేదెలు మేపుతోంది. సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చీరలు ధరించి నల్లటి ఛాయతో ఉన్న ఇద్దరు వ్యక్తులు పోతుల గుట్ట వైపు నుంచి ఆమె వైపు వస్తూ కనిపించారు. ఎవరు ఎవరు అని పలకరించిన ఆ ఇద్దరు దుండగులు ఆమెను సమీపిస్తూ, తమ జోలేలో ఉన్న ఏదో పొడి పదార్థాన్ని ఆమెపై విసిరేందుకు యత్నిస్తూ వెంటపడ్డారు. ప్రాణభయంతో బుజ్జమ్మ సమీప పొలంలో గులక రాళ్లు ఏరుతున్న అత్త, మరికొందరు మహిళల దగ్గరకు పరుగుతీసింది. దీంతో దుండగులు వెనుదిరిగారు. బుజ్జమ్మ వెంటనే భర్త వెంకట్‌నాయక్‌కు చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించి, వెంటనే పొలం దగ్గరకు మరో వ్యక్తి సంజీవరెడ్డితో కలిసి గుట్ట ప్రాంతంలో వెతికారు. చీరలు ధరించి శరీర దారుఢ్యం కలిగిన థర్డ్ జెండర్ వ్యక్తులుగా గుర్తించారు. అప్పటికే చీకటి పడటంతో పోతులగుట్ట ముళ్ల పొదాల్లో దుండగులు తప్పించుకున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ వసంతను వివరణ కోరగా అడవిలో వెతికినా దుండగుల ఆచూకీ లభించలేదన్నారు. పొలాల దగ్గర ఎలాంటి అనుమానితులు కనిపించినా తమకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. దీంతో చుట్టపక్కల రైతులు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు దుండగులను పట్టుకొని శిక్షించాలని కోరుతున్నారు.

వృద్ధురాలిని ఢీకొట్టిన ద్విచక్రవాహనం

అడ్డుకున్న కానిస్టేబుల్‌పై దాడికి యత్నం

నాగర్‌కర్నూల్ క్రైం: వేగంగా వచ్చిన ద్విచక్రవాహనదారుడు వృద్ధురాలిని ఢీ కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలైన ఘటన జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాల ఎదుట శుక్రవారం రాత్రిచోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తాడూరు మండలంలోని పర్వతాయిపల్లికి చెందిన అంతమ్మ కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఆమె శుక్రవారం రాత్రి మెడికల్ కళాశాల ఎదుట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా, పాలెం గ్రామానికి చెందిన బాలస్వామి ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తూ ఆమెను ఢీ కొట్టాడు. దీంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ సమయంలో బిజినేపల్లి నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్న కానిస్టేబుల్ చిన్న ద్విచక్రవాహనదారుడిని ఆపేందుకు ప్రయత్నించాడు. ద్విచక్రవాహనదారుడు బాలస్వామి మరో నలుగురితో కలిసి కానిస్టేబుల్‌పై దాడికి యత్నించారు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని బాలస్వామితో పాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వృద్ధురాలిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

మహిళ భక్తురాలి బంగారు గొలుసు చోరీ

గద్వాల క్రైం: జములమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన మహిళ భక్తురాలి మెడలో నుంచి బంగారు గొలుసు చోరీ చేసిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. మదనాపురం మండలం రామన్‌పాడుకి చెందిన క్రిష్ణవేణి పౌర్ణమి సందర్భంగా జములమ్మ దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం జములమ్మ స్టేజీ వద్ద బస్సు ఎక్కుతున్న క్రమంలో గుర్తుతెలియని దుండగులు మహిళ మెడలోని మూడు తులాల బంగారు గొలుసును అపహరించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. నిందితుడి కోసం పోలీసులు ప్రయత్నం చేసినప్పటికీ ఎలాంటి ఫలితం కనిపించలేదు. మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలియజేశారు.

ధాన్యం చోరీకి యత్నం

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడ గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. పెద్దదగడ శివారులోని గోదాంలో డీసీఎం, బొలెరో వాహనాల్లో దాదాపు 300 వడ్ల బస్తాలను ఎత్తుకెళ్తుండగా, పోలీసులు పట్టుకున్నారు. గోదాం యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ఈ కేసుపై పూర్తిస్థాయి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

ఆత్మకూర్: ప్రేమ పేరుతో మాయమాటలు చెప్పి బాలికను బలవంతంగా ఎత్తుకెళ్లిన ఘటనలో పోక్సో చట్టం, కిడ్నాప్ కేసులు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి మైనర్ బాలికను నాలుగురోజుల క్రితం కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడని, ఈ విషయంపై కుటుంబసభ్యులు 22న ఫిర్యాదు చేశారు. శనివారం సదరు నిందితుడిన అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరిచగా, న్యాయమూర్తి 14 రోజులు జ్యుడిషియల్ రిమాండ్‌కు ఆదేశించినట్లు తెలిపారు.

మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైన సంఘటన గద్వాల మండలం కుర్వపల్లిలో శనివారం చేటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పది రోజుల నుంచి గ్రామంలో వృద్ధుడు(68) భిక్షాటన చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. అయితే గ్రామ శివారులో సాయంత్రం అపస్మారక స్థితిలో పడి కనిపించాడు. స్థానికులు దగ్గరకు వెళ్లి పరిశీలించగా.. అప్పటికే మృతి చెందాడని రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని రూరల్ ఎస్‌ఐ పర్వతాలు తెలియజేశారు.